క్లుప్తంగా

ఆలయ భూముల శిస్తుకు వేలం

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ భూములు శిస్తులకు శుక్రవారం వేలం నిర్వహించారు. ఆలయ నిర్వహణ అధికారి దివ్యతేజ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా చుట్టుపక్కల రైతులు హాజరయ్యారు. ప్రస్తుతం 12 ఎకరాల భూములు శిస్తులకు వేలం నిర్వహించగా లింగంపేట గ్రామానికి చెందిన గోలకొండ చినసత్తిబాబు ఐదు ఎకరాలను రూ.24వేలకు దక్కించుకున్నారు. గతేడాది ఈ ఐదెకరాలు రూ. 29 వేలకు శిస్తుకు వెళ్లిందని, ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి, నిర్ణయం తీసుకుంటామని ఈవో తెలిపారు. మరో 7 ఎకరాలకు సంబంధించి వేలం పాటలో రైతులు ఎవరూ ఆసక్తి చూపలేదని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రచారం



శరభవరంలో విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటున్న సీఆర్పీ సతీష్

రోలుగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం సీఆర్పీలు, ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. కొండపాలెం, శరభవరం, జె.నాయుడుపాలెం, బుచ్చింపేట, వడ్డిపలో శుక్రవారం ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సతీష్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కె.సంతపాలెంలో నాగ దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ట



నాగ దుర్గాలమ్మను దర్శించుకుంటున్న సర్పంచ్ చల్లా మంగ, తదితరులు

కె.కోటపాడు : కె.సంతపాలెంలో నిర్మించిన నాగదుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ విగ్రహ ప్రతిష్ట పూర్తయిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. గ్రామానికి చెందిన భక్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారిని స్థానిక సర్పంచ్ చల్లా మంగ, సింహాద్రినాయుడు(పోస్ట్ నాయుడు) దర్శించుకున్నారు.

సూదివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : గర్భిణులు, బాలంతలు పౌష్టికాహారంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే అనుబంధ ఆహారాన్ని తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. మండలంలో సూదివలస గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 137 మందికి సాధారణ ఆరోగ్య పరీక్షలను చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించుకోవడం వల్ల మాతాశిశు మరణాలు ఉండవని ఆమె తెలిపారు. పీహెచ్ఎన్ ప్రమీల, ఏఎన్‌ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసంతర్పణ



కోనాంలో అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు

చీడికాడ: మండలంలోని కోనాంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కోనాం పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సలుగు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు సలుగు ప్రసాదు, దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తప్పని నిరీక్షణలు..!

- 'ఇంటి వద్దకే రేషన్' విధానానికి కూటమి ప్రభుత్వం మంగళం
- ఇక నుంచి డిపోల వద్దే రేషన్ బియ్యం పంపిణీ
- రవాణా సౌకర్యం లేని గిరిజనులకు తప్పని వెతలు

గొలుగొండ: ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో పేదలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గత టీడీపీ పాలనలో రేషన్ బియ్యం కోసం రోజుల తరబడి డిపోల వద్ద నిరీక్షిస్తున్న పరిస్థితులు చూసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామానికి నేరుగా వాహనాలపై ఇంటింటికి వెళ్లి బియ్యం సరఫరా చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడా విధానానికి ప్రస్తుత సీఎం చంద్రబాబు మంగళం పాడారు. దీంతో గొలుగొండ మండలంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో 29 పంచాయతీల పరిధిలో 80 వరకు గ్రామాలు ఉన్నాయి. సుమారుగా 22 వేలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 32 గ్రామాలు పూర్తిగా గిరిజన గ్రామాలు. 4,100 వరకు గిరిజన లబ్ధిదారులు ఉన్నారు. వీరంతా పంచాయతీ కేంద్రాలకు, రేషన్ డిపోలకు సుమారుగా 4 నుంచి 7 కిలోమీటర్ల దూరంలో నివాసం ఉంటున్నారు.

జగన్ పాలనలో ఇంటికే రేషన్ పంపిణీ

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఇంటి వద్దనే రేషన్ అందించాలన్న లక్ష్యంతో 2021లో ఎండీయూ వాహనాలను ప్రారంభించారు. ఇలా మండలంలో ప్రతి ఇంటికి నిత్యావసర సరకులు ఇప్పటి వరకు సక్రమంగా అందాయి. గిరిజనులకు రాకపోకల కష్టాలు తీరాయి. 2024లో అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు.. సంక్షేమాన్ని విస్మరిస్తుండడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. మండలంలో 32 గ్రామాల గిరిజన ప్రజలు వచ్చేనెల నుంచి కిలోమీటర్ల మేర నడిచి డిపోల వద్దకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకునే పరిస్థితి నెలకొంది.



బుడ్డపాడు గ్రామంలో ఎండీయూ వాహనం ద్వారా గిరిజనులకు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇబ్బందులు ఇలా..

మండలంలో డిపో నంబర్ 13 ద్వారకానగరం గ్రామంలో ఉంది. ఈ డిపో పరిధిలో ఉన్న బుడ్డడపాడు, చంద్రయ్యపాలెం, పోలవరం, అంటిమానుజోరులు గిరిజన గ్రామాల ప్రజలు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ద్వారకానగరం రావాల్సిందే. గిరిజన ప్రజలు ఎన్ని కష్టాలు పడాలో ఇట్టే అర్థం అవుతుంది. ఈ గ్రామాలకు ఎటువంటి రవాణా సౌకర్యం కూడా లేదు.

- డిపో నంబర్ 14 పాతమల్లంపేట గ్రామంలో ఉంది. ఈ డిపో పరిధిలో గదబపాలెం, ఉగ్గంపేట, కొత్తపాలెం, భీమునిపట్నం గ్రామాలు ఉన్నాయి. వీరంతా 4 కిలోమీటర్ల దూరం నడిచి సరకులకు రావాలి.
- డిపో నంబర్ 10 సాలికమల్లవరంలో ఉంది. దీని పరిధిలో వెంకటాపురం, పాగచెట్లపాలెం గిరిజన ప్రజలు ఉన్నారు. వీరికి కూడా రవాణా సౌకర్యం లేదు. 4 కిలోమీటర్లు నడిచి డిపోకు వెళ్లాల్సిందే.
- ఇలా మండలంలో సుమారుగా 4 నుంచి 7 కిలోమీటర్ల మేర నడిచి రోజుల తరబడి సరకుల కోసం డిపోలకు వెళ్లాల్సి ఉంది. 32 గిరిజన ప్రజలు సరకుల కోసం ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చింది. గతంలో 13 ఎండీయూ వాహనాల ద్వారా నేరుగా ఇంటికే సరకులు అందేవి.

రేషన్ కోసం 7 కి.మీ. నడవాలి



జగన్ పాలనలో ఇంటికి తీసుకువచ్చి బియ్యం ఇచ్చేవారు. వచ్చే నెల నుంచి డిపోల వద్దకు వెళ్లి తీసుకోవడం ద్వారా చాలా కష్టాలు పడే పరిస్థితి వస్తుంది. 7 కిలోమీటర్ల మేర నడిచి బియ్యం కోసం వెళ్లడం అంటే నరకయాతనే. జగన్ పానలో ప్రజలకు ఎంతో మేలు జరిగింది.

– అచ్చియ్యమ్మ, బుడ్డడపాడు గిరిజన గ్రామం

ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి..



ఎండీయూ వాహనాలు తొలగించడం వల్ల గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. కనీసం డిపోలకు దూరంగా ఉన్న శివారు గిరిజన గ్రామాలకు అయినా ఎండీయూ వాహనాల ద్వారా సరకులు అందించాలి. డిపోలకు వెళ్లి సరకులు తీసుకెళ్లే పరిస్థితి వస్తే పాత మల్లంపేటలో 7 గ్రామాల గిరిజనులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

– లెక్కల సత్యనారాయణ, మాజీ సర్పంచ్, పాత మల్లంపేట

తాండవలో పెరిగిన నీటి మట్టం



నీటితో కళకళలాడుతున్న తాండవ ప్రాజెక్టు

నాతవరం: ఇటీవల కురిసిన వర్షాలకు తాండవ రిజర్వాయరులో స్వల్పంగా నీటి మట్టం పెరిగింది. జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టుగా తాండవ రిజర్వాయరు ప్రత్యేకత సంతరించుకుంది. దీని నీటి ఆధారంగా రెండు జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాల పరిధిలో సుమారుగా 52 వేల ఎకరాలు ఆయకట్టులో ఖరీఫ్ సీజన్‌కు వరి పంట సాగవుతుంది. తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు. ప్రస్తుతం తాండవ రిజర్వాయరులో నీటి మట్టం 365 అడుగులకు చేరిందని ప్రాజెక్టు జేఈ ప్రేమకుమార్ తెలిపారు. వర్షాలకు ముందు తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 364.5 అడుగులు ఉండేదన్నారు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో రోజుకు 250 క్యూసెక్కులు నీరు ప్రాజెక్టులోకి వచ్చిందన్నారు. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కేవలం 42 క్యూసెక్కులు మాత్రమే ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు ఇబ్బంది ఉండదని జేఈ తెలిపారు.

మాడుగులలో అన్నా క్యాంటీన్ భవనానికి శంకుస్థాపన

మాడుగుల : మాడుగులలో అన్నా క్యాంటీన్ నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన దివ్యాంగులకు సన్మానం



దివ్యాంగ విద్యార్థులను సన్మానిస్తున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

రావికమతం: ఆటలు, చదువుకు అంగవైకల్యం అడ్డుకాదని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన మానసిక దివ్యాంగ విద్యార్థులను శుక్రవారం ఆయన సన్మానించారు. మండలంలో గర్నికం ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలం నుంచి జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ క్రీడా పోటీలకు ఎంపికైన అప్పికొండ గణేష్(దివ్యాంగుల యూనిఫైడ్ వాలీబాల్ గేమ్), నక్కరాజు బాల సరస్వతి(దివ్యాంగుల బోసి గేమ్)లను సత్కరించారు. వీరికి కాకినాడకు చెందిన సూర్య గోపీనాథ్ రూ.4వేల విలువ చేసే స్పోర్ట్స్ డ్రెస్సులు, షూస్ అందజేశారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు పాల్గొన్నారు.

అజేయపురంలో వైద్య శిబిరం



గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్యులు

రావికమతం: మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు అజేయపురంలో కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి రజని ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 28 మందికి వైద్య పరీక్షలు చేశారు. జ్వరాలు ఉన్న వారికి రక్త పరీక్షలు చేసి సాధారణ జ్వరాలుగా నిర్ధారించారు. అవసరమైన మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తృతంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తిమిరాంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం, తారువ, ఎం.అలమండ గ్రామాల్లో శుక్రవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రజలను కలిసి భగవద్గీతపై అవగాహన కల్పించారు. గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడేనని, త్రైత సిద్ధాంత భగవద్గీతయే శ్రీకృష్ణుడి నిజ బోధ అని వివరించారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలియజేయాలని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, వి.సురేష్, బి.పైడన్న, కె.సంతోష్, లక్ష్మి, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం వద్దు



చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తొట్టెలను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మాకవరపాలెం: గ్రామాల్లో చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం చేయొద్దని డీపీవో శిరీషారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని గిడుతూరు, బయ్యవరం, నారాయణరాజుపేట గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడి చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువు తయారీపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తాగునీటి క్లోరినేషన్‌తో పాటు వీధులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ అధికారులు పంపిణీ చేసిన బుట్టల్లోనే వేస్తూ పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెత్త సంపద కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి నాగలక్ష్మి, డీఎల్‌పీవో మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పాక్షికంగా ఇల్లు కూల్చివేత దారుణం

కోటవురట్ల: జగనన్న కాలనీలో ఎన్నో వ్యయప్రయాసలతో నిర్మించుకున్న ఇంటిని కూటమి ప్రభుత్వం కూలగొట్టడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే ఆశయంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి లే అవుట్‌లో చివరన ఉన్న ఫ్లాట్లలో అదనంగా ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కలుపుకుని ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం కలగలేదన్నారు. అయితే రాజకీయ కక్షతో ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూలగొట్టే ఘనతను కూటమి ప్రభుత్వం దక్కించుకుందని విమర్శించారు. గొట్టివాడ జగనన్న కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టుమూరి అప్పారావు నిర్మించుకున్న ఇంటిని పాక్షికంగా కూలగొట్టడం దారుణమన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే ఆ ఇంటిని కూలగొట్టారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో పల్లెల్లో రాజకీయ కక్షలు చోటుచేసుకుని ఆత్మీయతలు, బంధాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

7న వీరాంజనేయ కలశ ప్రతిష్ట

మాడుగుల: వచ్చే నెల 7న స్థానిక గాంధీ పార్కు వద్ద వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం జరగనుందని ఆలయ నిర్వాహకుడు రాఖీ శ్రీను తెలిపారు. అదే రోజు ఆలయంపై కలశ ప్రతిష్టతో పాటు విజయాంజనేయ విగ్రహ పునః ప్రతిష్ట, సీతారాములవారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే వారు ఆలయ కమిటీని సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రోలుగుంట ఎస్ఐకు ప్రశంసా పత్రం



జిల్లా ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు

రోలుగుంట: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితులను గాలించి పట్టుకున్న రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావును అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్ఐకు ప్రశంసా పత్రం అందచేశారు.

'అక్రమ తవ్వకాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం'

చోడవరం: ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని జనసేన చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. మండలంలో శారదానదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను, నర్సాపురం, రాయపురాజుపేట, శీమునాపల్లి, వెంకన్నపాలెం, గవరవరం, లక్కవరం, గజపతినగరం, జుత్తాడ, అంబేపురం, భోగాపురం ప్రాంతాల్లో ఇసుక, గ్రావెల్ తవ్వకాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. స్థానిక అధికార పార్టీ నాయకుల సహకారంతో ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని రాజు చెప్పారు. పార్టీ నాయకులు అల్లం రామఅప్పారావు, గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్, రేవళ్ల రమేష్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో చీడికాడ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

చీడికాడ: ఆల్ ఇండియా సైనిక్ సూల్ ఎంట్రన్స్ పరీక్షలో చీడికాడకు చెందిన పుట్టా దీపుసాత్విక్ ప్రతిభ కనబరిచాడు. 300 మార్కులకు 280 మార్కులు సాధించినట్టు విద్యార్థి తల్లిదండ్రులు పుట్టా రమేష్ గుప్తా, శ్రీదేవి తెలిపారు. విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన ప్రసాద్‌ను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పరువాడ మహేష్, అప్పారావు, రెడ్డి బలరాం, సిమెంట్ నాయుడు అభినందించారు.

హత్యాచార నిందితుడిని ఉరి తీయాలి



జైతవరంలో నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చీడికాడ: కడపలో చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన యువకుడిని ఉరి తీయాలని ఎంఆర్‌పీఎస్ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు మారుడుబైడి నాగరాజు, మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్తా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జైతవరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నారులపై జరుగుతున్న దారుణాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించకుంటే మరింత దారుణాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇటువంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

దేశ హితమే 'తితిక్ష' నాటిక



చీకటి పువ్వు నాటికలో సన్నివేశం



తితిక్ష నాటికలో కోర్టు సన్నివేశం

కశింకోట: దేశ హితం కోసం సమాజ నాశనానికి కారణభూతమవుతున్న గంజాయి వ్యాపారాన్ని మానడానికి ససేమిరా అన్న కుమారున్ని కన్నతల్లి హతమార్చిన కథాంశంతో ప్రదర్శించిన 'తితిక్ష' (సహనం) నాటిక ఆహూతులను విశేషంగా అలరించింది. ఇక్కడి అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళాపరిషత్ నాల్గో దఫా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా గురువారం రాత్రి స్థానిక గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వేదికపై రెండో నాటికగా ప్రదర్శించారు. రాత్రి ఒంటి గంట ప్రాంతం వరకు నాటిక ప్రదర్శన సాగింది. కాకినాడకు చెందిన ఉమా ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన నాటిక ఇలా సాగింది. దేశం కోసం తన ప్రాణాలను శ్రీకృష్ణ త్యాగం చేశారు. భార్య భారతి తన కుమారుని అల్లారు ముద్దుగా పెంచుతోంది. అతడు రహస్యంగా సాగిస్తున్న గంజాయి వ్యాపారం మానివేయాలని చెప్పగా, దానికి ససేమిరా అనడంతో హత్య చేసి జైలుకు వెళ్తుంది. అయితే భారతి అన్నయ్య రాధాకృష్ణ మాత్రం తన చెల్లెలు నిర్దోషి అని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు. కోర్టులో వాదోప వాదనల్లో భారతి తాను చంపింది గంజాయి రాక్షసుడ్ని అని, చంపకపోతే ఎన్నో జీవితాలు నాశనమవుతాయని అంటుంది. న్యాయ స్థానం తీర్పు ఇవ్వబోతుండగా, గంజాయి భూతం వచ్చి ఆమెను చిత్రహింసలు పెడుతుంది. న్యాయ దేవత కళ్ల గంతలు విప్పి చేతిలో ధర్మ కాటాను భారతి చేతిలో పెడుతుంది. రాజ్యాంగ పుస్తకాన్ని మరో చేతిలో పెట్టి గంజాయి రాక్షసుడ్ని సంహరిస్తుంది. భారతిగా ఎస్. జ్యోతిరాణి, హరిచంద్రగా బి. గణేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డి. ఉమా శంకర్, రాధాకృష్ణగా రాధాకృష్ణ, జడ్జిగా కె. పుల్లారావు, ఎస్ఐగా నాచూడి అప్పారావు, అమీన్‌గా శ్రీనివాసరావు, వివేక్‌గా డీఎస్ఎస్ కుమార్, అభిరాంగా డి. వినయ్, విలేకరిగా రఘుబాబు, గంజాయి భూతంగా శ్రీనివాస్, న్యాయ దేవతగా ముళ్లపూడి ఈశ్వరి, లాయర్‌గా ముళ్లపూడి విజయలక్ష్మి పాత్రోచితంగా నటించి ఆహూతులను మెప్పించారు. డి. ఉమాశంకర్ రచనకు కుమారుడు వినయ్ దర్శకత్వం వహించారు. రమణ సంగీతాన్ని సమకూర్చారు.

క్షమించడంలోనే నిజమైన ప్రేమ.. 'చీకటి పువ్వు'

రాత్రి పది గంటల ప్రాంతంలో నిర్వహించిన 'చీకటి పువ్వు' నాటిక ఆహూతులను అలరించింది. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళా భారతి బృందం ఈ ప్రదర్శన జరిపింది. జీవితంలో తప్పులు చేయడం సహజం. వాటిని తెలుసుకొని పశ్చాత్తాప పడిన తర్వాత వారిని దూరం పెట్టకుండా పెద్ద మనస్సుతో క్షమించి దగ్గరకి చేర్చుకోవాలి. ప్రాణం పోయిన తర్వాత బాధపడే కంటే ఉన్నప్పుడే బతికి ఉండగా, బాధ్యతగా వ్యవహరించి చేరదీయాలని, క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని తెలియజెప్పే ఇతివృత్తంతో నాటికను ప్రదర్శించారు. పవిత్రగా గుడివాడ లహరి, వంశీగా కొత్తకొండ సత్యనారాయణ, హరిగా మంచాల రమేష్, సిద్ధార్థగా సూర్య, మోహన్ ప్రసాద్‌గా ఏపూరి శ్రీనివాస్, పీఎస్ నారాయణ మూలకథకు పరమాత్ముని శివరాం నాటకీకరణ చేశారు. మంచాల రమేష్ దర్శకత్వం వహించగా సురభి నాగరాజు సంగీతాన్ని అందించారు. రెండో రోజు జరిగిన ఈ నాటిక పోటీలను వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. వారితోపాటు పోటీలకు సహకారం అందించిన ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వ్యాపారవేత్త పువ్వుల శ్రీనివాసరావు, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుడు ఆళ్ల లింగాజీలను నిర్వాహకులు, అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు తదితరులు దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

తుది దశలో నూకాంబిక ఆలయ పునర్నిర్మాణం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, త్వరలో ప్రారంభించి భక్తులకు దర్శన భాగ్యం కలిప్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక నూకాంబిక ఆలయంలో దేవదాయ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయంలో వేస్తున్న గ్రానైట్ ఫినిషింగ్ టైల్స్‌ను వాడకూడదని, దీనిని మార్చి రఫ్ గ్రానైట్, న్యాచురల్ స్టోన్ ఫ్లోరింగ్ వేయాలని సూచించారు. ఆలయ ప్రాంతమంతా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు దేవాలయంలో ఏసీలు, విద్యుత్ దీపాలు విరివిగా ఏర్పాటు చేయాలని కోరారు. దేవాలయ ప్రాంగణంలో ఇకపై చేయు అభివృద్ధి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం, నాణ్యతా ప్రమాణాలతో చేయాలన్నారు. ఆలయానికి కావలసిన భూములు కొనుగోలు చేయడానికి సంబంధిత యజమానులతో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వి.రాంబాబు, దేవదాయ శాఖ డీఈఈ కృష్ణ, ఉప సపతి శ్రీనివాసచార్యులు, ఏఈ శివప్రసాద్, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.